క్లుప్తంగా

ఒమ్మలిలో పైడితల్లమ్మ ఒడ్డు పండగ



ఘటం మోస్తున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్: ఒమ్మలిలో పైడితల్లమ్మ ఒడ్డు పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొద్దాపు భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పండగ సందర్భంగా 101 ఘటాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అమ్మవారి ఘటాన్ని నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పూజలు చేశారు. గ్రామ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పరదేశమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో మంగళవారం పరదేశమ్మ తల్లికి పసుపు కుంకుమలతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ మహిళలు పసుపుకుంకుమతో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి భారతి

కె.కోటపాడు: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, వైద్య సిబ్బంది సూచించే ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి భారతి తెలిపారు. మంగళవారం కె.అగ్రహారంలో 89 మందికి సాధారణ వైద్య పరీక్షలతోపాటు ఏడుగురు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. వేడి చేసి చల్లార్చిన నీటిని సేవించాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, డీఈవో మనీషా, ఆశా కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ తల్లి ఒడ్డు పండగ

దేవరాపల్లి: రైవాడ పంచాయతీ శివారు శంభువానిపాలెంలో గ్రామదేవత పరదేశమ్మ తల్లి ఒడ్డు పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తెల్లవారుజాము నుంచి అమ్మవారిని దర్శించుకుని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి, రైవాడ పంచాయతీ గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

చోడవరం రూరల్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ చోడవరం శాఖ, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, ఐ డ్రీమ్ నేత్రాలయంల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. చోడవరంలోని స్టేట్ బ్యాంకుకు ఎదురుగా ఐ డ్రీమ్ నేత్రాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తారు. ఎటువంటి కంటి సంబంధమైన సమస్యలతో సతమతమవుతున్న వారైనా ఈ శిబిరానికి హాజరై ఉచిత వైద్య సేవలు పొందవచ్చని, కళ్లద్దాలు అవసరమైనచో తక్కువ ధరలో అందిస్తామని లయన్స్ క్లబ్ చోడవరం శాఖ అధ్యక్షుడు డాక్టర్ నీలం నాగేంద్రబాబు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ప్రాజెక్టు చైర్మన్ వేపాడ సత్యనారాయణ, సర్వీస్ పర్సన్ ముక్కా రమేష్‌లను సంప్రదించాలని కోరారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ

కె.కోటపాడు: ఖరీఫ్ సాగులో రైతులకు అవసరమయిన వరి విత్తనాలను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేపడుతున్నారు. చౌడువాడ ఆర్బీకే వద్ద మంగళవారం సబ్సిడీపై ఆర్జీఎల్, సోనామసూరి, శ్రీధృతి, మార్టేరుసాంబ రకం విత్తనాలను పంపిణీ చేశారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న రైతులకు వరి విత్తనాలను అందించినట్లు వ్యవసాయశాఖ సహాయకురాలు రామాంజలి తెలిపారు. రైతులకు విత్తనాలను సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ పంపిణీ చేశారు.

రైతన్నలు బిజీబిజీ

వరి నారుమడి పనుల్లో నిమగ్నం



నారుమడి తయారీ కోసం దుక్కు దున్నుతున్న రైతు



బోరు నీరు ఆధారంగా వేసిన వరి నారుమడి

చోడవరం: అన్నదాతలు వ్యవసాయ పనులతో బిజీబిజీగా మారారు. నాలుగు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ పనులు ప్రారంభించారు. నారుమడులు సిద్ధం చేస్తున్నారు. ఇదే సమయంలో గ్రామ సచివాలయాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ బుకింగ్‌పై వారికి కావలసిన విత్తనాలను సమకూర్చుకున్నారు. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు తమ వద్ద విత్తనాలను ఇప్పటికే నారుమడుల్లో వేసేందుకు విత్తన శుద్ధి చేయగా, వర్షాధారంపై రైతులు నారుమడుల్లో విత్తనాలు జల్లేందుకు సిద్ధమయ్యారు. తొలకరి వర్షాలు వ్యవసాయ పనులకు ఎంతో ఉపయోగపడింది. పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతమైన నియోజకవర్గంలో చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో 26 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి వేసేందుకు రైతులంతా సిద్ధమయ్యారు.

జోరుగా వరి విత్తనాల పంపిణీ...

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కొత్తగా ఏర్పడ్డ ఎన్‌డీఏ ప్రభుత్వం ఇంకా రైతులకు పెట్టుబడుల నిమిత్తం రైతు భరోసా డబ్బులు వేయకపోవడంతో రైతులు ఎదురు చూస్తున్నారు. అయితే వర్షాలు కురుస్తుండటంతో పొలం పనులు మాత్రం ప్రారంభించారు. నియోజకవర్గంలో హెచ్చు సాగుభూమి వర్షాధారంపైనే ఉండటంతో పూర్తిస్థాయిలో వర్షాలు కురిస్తేనే అనుకున్న మేర సాగు చేయడానికి అవకాశముంది. ఈ పరిస్థితిలో ఈశాన్య రుతుపవనాలు పుణ్యమా అని మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో ఎక్కడ చూసినా రైతులు నారుమడులు సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. సీజన్ ప్రారంభం నుంచే పూర్తిస్థాయిలో అన్ని రకాల విత్తనాలు వ్యవసాయ శాఖకు చేరడంతో గ్రామ సచివాలయాల ద్వారా విక్రయాలు జోరందుకున్నాయి. పల్లం, ముంపు ప్రాంతాల్లో ఆర్జీఎల్, స్వర్ణ, 1001, జయ, రకాలపై ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అయినప్పటికీ ఈ ఏడాది ఆర్జీఎల్, సోనామసూరి, సాంబమసూరి, స్వర్ణ, అమర(1064) రకాలు అందుబాటులో ఉంచారు. ఆర్బీకేలతోపాటు లైసెన్సుతో నడిచే ప్రైవేటు ఎరువుల దుకాణాల్లోనూ వరి విత్తనాలు అమ్మకాలు ప్రారంభించారు.

దేవరాపల్లిలో చిరుజల్లులతో సరి

వారం రోజులుగా ముఖం చాటేస్తున్న వరుణుడు



దేవరాపల్లిలో చిరుజల్లు పడుతున్న దృశ్యం

దేవరాపల్లి: మండలంలో వారం రోజులుగా వరుణుడు దోబుచులాడుతున్నాడు. రోజూ మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో హడావిడి చేసి వర్షం కురవకుండా ముఖం చాటేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం సైతం మేఘాలు కమ్మేయడంతో భారీ వర్షం కురుస్తుందనుకుని ఈ ప్రాంత రైతులు ఎంతో ఆశగా ఎదురు చూశారు. చివరకు చిరుజల్లులే పడటంతో ఉసూరుమన్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభ కావడంతో వరి విత్తనాలను సిద్ధం చేసుకున్న అన్నదాతలు వరుణుడి కరుణ కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి చిన్నపాటి వర్షం, చిరుజల్లులు తప్పా భారీ వర్షం కురవలేదు. దాంతో ఖరీఫ్ సాగుపై ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురవక పోవడంతో రైవాడ జలాశయంలో రోజురోజుకు నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. భారీ వర్షం కురిస్తే తప్పా జలాశయం నీటి మట్టం పెరిగే పరిస్థితి లేదు. దీనిపై ఆధారపడి వేలాది మంది ఆయకట్టు రైతులు ఖరీఫ్ సాగు చేపడుతున్నారు.

బుడ్డడపాడులో వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గొలుగొండ: మండలంలో పాత మల్లంపేట పంచాయతీ శివారు బుడ్డడపాడులో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో విషజ్వరాలు అధికంగా ఉండటంతో గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 50 మందిని పరీక్షించారు. వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ ప్రాంతంలో దోమలు అధికంగా ఉండటం వల్ల ఈ సమస్యలు వస్తున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. 15 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో నర్సీపట్నం డివిజన్ సీనియర్ వైద్యాధికారి ప్రశాంతి, డాక్టరు కీర్తి, సీహెచ్‌వో ప్రసాద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రసన్న



డయేరియా నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: కాలానుగుణంగా వస్తున్న సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న తెలిపారు. మంగళవారం చమ్మచింతలో వైద్య శిబిరం నిర్వహించారు. 68 మంది రోగులను పరిక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేసి డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగినట్లయితే రోగాలు వ్యాపించకుండా ఉంటాయన్నారు. ఇళ్ల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాతావరణంలో మార్పులు దృష్ట్యా నిల్వ చేసిన మాంసం, చేపలు వంటి ఆహారం తీసుకోవద్దన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులను నివారించాలంటే ప్రస్తుతం ఆకుకూరలు, పప్పు దినుసులతో కూడిన పౌష్టికాహారం తీసుకున్నట్లయితే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. వృద్ధులు, చిన్నారులు డయేరియా రాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సచివాలయంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని, గ్రామంలో ఎవ్వరికీ ఆరోగ్య సమస్య వచ్చినా వారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఆరోగ్య విషయంలో వైద్యుల సూచనలు విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, ఎంపీడీవో రాంబాబు

నాతవరం: సమాజంలో పేదలను అన్ని విధాలుగా ఆదుకోవడంలో స్వచ్ఛంద సంస్థలు పాత్ర చాలా కీలకమని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. నాతవరంలో ఇటీవల రెండు పూరిల్లు ప్రమాదశావత్తు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు నాసా స్వచ్ఛంద సేవా సంస్థ మండల సామాజిక సేవా కార్యకర్త తాటిపాక శ్రీను నిత్యావసర సరుకులు, దుస్తులు, వంట సామగ్రిని సమకూర్చారు. వీటిని మంగళవారం బాధిత కుటుంబాలకు అందజేసి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఎక్కడ అగ్ని ప్రమాదం సంభవించినా బాధితులను నానా స్వచ్ఛంద సేవా సంస్థ ఆదుకుంటుందన్నారు. ఇటీవల సరుగుడు, సుందరకోట పంచాయతీల్లోనూ గిరిజనులకు అండగా నిలిచిందన్నారు. ప్రభుత్వం కార్యక్రమాలతోపాటు స్వచ్ఛంద సంస్థలు సేవలు పేదలను ఆదుకోవడానికి దోహదపడుతున్నాయన్నారు. ఎంపీడీవో రాంబాబు మాట్లాడుతూ అగ్ని ప్రమాద బాధితులకు ప్రభుత్వ పరంగా వచ్చే సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు బంగారి సూరిబాబు, డీపీఐఎస్ మండల శాఖ అధ్యక్షుడు సామర్ల రామారావు, గ్రామ కమిటీ నాయకుడు ఈరుడి గంగరాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని ర్యాలీ



పిల్లలను బడికి పంపాలని కోరుతూ ర్యాలీ

చోడవరం రూరల్: పిల్లలను పనిలో చేర్చడం నేరమని, వారు ఉండాల్సింది పనిలో కాదు బడిలో అంటూ లక్కవరంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా స్కూల్ కాంప్లెక్స్ నుంచి ప్రారంభమై ఈ ర్యాలీ అన్ని వీధుల్లో సాగింది. ఆరు నుంచి 14 ఏళ్లలోపు వారిని విధిగా పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తూ నినాదాలు చేశారు. పిల్లల బంగారు భవిష్యత్తు బడికి పంపడం ద్వారానే సాకారం అవుతుందని, పనుల్లో చేరిస్తే దొరికేది, చివరికి మిగిలేది కూలి మాత్రమే అంటూ హితవాక్యాలతో ప్రదర్శన సాగింది. జెడ్పీ ఉన్నత, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఓ.సీతబాబు, శ్రీను ఉపాధ్యాయులు శివ, గంగ, సురేష్, ఎం.వి.స్వామి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సి.ఆర్.ఎం.టిలు పద్మ, కె.వి.మహాలక్ష్మినాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వారపు సంత వెలవెల



జనం లేక ఖాళీగా దర్శనమిస్తున్న రోడ్డు

మాకవరపాలెం: భానుడి ప్రతాపంతో వారపు సంత వెలవెలబోయింది. మండల కేంద్రంలో ప్రతి మంగళవారం సంత జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి భానుడు ఉగ్రరూపం దాల్చాడు. దీంతో సంతకు జనం వచ్చేందుకు హడలెత్తిపోయారు. సంత రోజున కిక్కిరిసిపోయి ఉండే విశాఖ-నర్సీపట్నం ప్రధాన రహదారి జనం లేక ఖాళీగా దర్శనమిచ్చింది. దీంతో కొనుగోలుదారులు లేక వ్యాపారులు ఉసూరుమని చూడాల్సి వచ్చింది.

ప్రమాదాలకు నిలయంగా బీఎన్ రోడ్డు



బి.ఎన్.రోడ్డు రోలుగుంటలో ఇక్కట్లు పడుతూ రోడ్డు దాటుతున్న వాహనచోదకులు

రోలుగుంట: భీమిలి –నర్సీపట్నం రోడ్డు పొడవునా గోతులతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డులో రేయింబవళ్లు వాహన రాకపోకలు సాగుతూనే ఉంటాయి. పదేళ్లుగా ఈ సమస్య ఇలానే ఉంది. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఈ మార్గంలో చోడవరం నియోజకవర్గం వడ్డాది నుంచి రోలుగుంట మండలం సరిహద్దు వెలంకాయలపాలెం వరకూ రోడ్డు ఏర్పాటుకు రూ.95 లక్షలు మంజూరు చేయించారు. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు రోడ్డు నిర్మాణంలో తాత్సారం చేయడం, ఎన్నికలు రావడం నూతన ప్రభుత్వం ఏర్పడడం కూడా అయిపోయింది. అయితే రోడ్డు సమస్య మాత్రం అలాగే ఉంది. రోలుగుంట మండలం కంచుగుమల కూడలి నుంచి వెలంకాయలపాలెం వరకూ దారి పొడవునా ఉన్నట్టు వంటి గోతుల్లో చిన్నపాటి వర్షానికి సైతం నీరు చేరి తటాకాలను తలపిస్తున్నాయి. ఈ గోతుల్లో ప్రయాణాలు చేస్తూ రాత్రిళ్లు అదుపు తప్పి పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గోతులు పూడ్చి, రోడ్డు సమస్య మెరుగుపరచాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

వరి విత్తనాల కోసం రిజిస్ట్రేషన్లు



కొమరవోలులో రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ వ్యవసాయాధికారి నవ్య

రోలుగుంట: మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులు కోరిన వరి విత్తనాల కోసం మంగళవారం రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. దీనిలో భాగంగా కొమరవోలు ఆర్బీకేలో ఇక్కడ సచివాలయ వ్యవసాయాధికారి పి.నవ్య రైతుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమాలను మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి పర్యవేక్షించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



బుచ్చెయ్యపేట సమావేశంలో పాల్గొన్న అధికారులు

బుచ్చెయ్యపేట: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వెంకటాచార్య తెలిపారు. మంగళవారం మండల పరిషత్ మీటింగ్ హాలులో అన్ని గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వర్షాలు కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పర్చాలన్నారు. బోర్లు, కుళాయిల వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చేయడం ద్వారా ఈగలు, దోమలు వ్యాపించవన్నారు. ప్రతి గ్రామంలో వారానికొక రోజు మంచినీటి ట్యాంక్ క్లీనింగ్, పది రోజులకొకసారి క్లోరినేషన్ చేయాలన్నారు. ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరీష్ పాల్గొన్నారు.

అర్లలో కొనసాగిన వైద్య శిబిరం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు శ్రీనివాసరాజు

రోలుగుంట: గిరిజన గ్రామం అర్లలో సోమవారం బుచ్చింపేట పీహెచ్‌సీ వైద్యులు ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరం మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీనివాసరాజు రోగులను పరీక్షించి అవసరమైనవారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. హెల్త్ అసిస్టెంటు హరిబాబు, ఏఎన్ఎం, ఆశాలతో కలసి ఇంటింటా తిరిగి రోగుల వివరాలు నమోదు చేసుకున్నారు. బుధవారం ఈ శిబిరం కొనసాగుతుందని ఈ సందర్భంగా వైద్యాధికారి తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి

నర్సీపట్నం: అవగాహన లేకపోవటం వల్ల చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో క్యాన్సర్‌పై వైద్యాధికారులకు, వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. క్యాన్సర్ అనేది ఒక తీవ్రమైన వ్యాధి అన్నారు. దీన్ని వివిధ లక్షణాల ద్వారా గుర్తించవచ్చన్నారు. సక్రమంగా బరువు తగ్గడం, జ్వరం, నిర్దిష్ట ప్రాంతంలో నొప్పి, అలసట, మహిళలో రొమ్ము ఆకారం లేదా రంగులో మార్పు, రుతుచక్ర కాలం నుంచి రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వెంటనే వైద్యులను సంప్రదించి వైద్యం పొందేలా అవగాహన కల్పించాలని సూచించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మిని, రావికమతం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావు, దంత వైద్యురాలు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

డయేరియా నివారణపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీవిద్య

మాకవరపాలెం: డయేరియా నివారణపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారి శ్రీవిద్య సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో డయేరియా వ్యాధి సోకినా వెంటనే అప్రమత్తం కావాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. పీహెచ్ఎన్ నాగమణి, ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

182 మంది రోగులకు వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు

మాడుగుల రూరల్: వీరనారాయణంలో మంగళవారం 182 మంది రోగులను కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.వి.ఎస్.ఎస్.ప్రసాదుపాత్రుడు పరీక్షించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు అందించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి, నివారణ గురించి రోగులకు అవగాహన కల్పించారు. ఏఎన్ఎం కె.రమణమ్మ, ఆరోగ్య సహాయకుడు పి. శంకర్, ఎంఎల్‌హెచ్‌పీతోపాటు ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



ప్రభుత్వ భూమిలో పని చేస్తున్న పొక్లెయిన్

నాతవరం: ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిపై గుమ్మడిగొండ సర్పంచ్ పంచాడ పాప, ఎంపీటీసీ సభ్యురాలు సుర్ల పాప తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. గుమ్మడిగొండ పంచాయతీలో సర్వే నంబరు 102/2లో 1–25 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని 2020లో అప్పటి ప్రభుత్వం జగనన్న కాలనీకి కేటాయించింది. అందులో జగనన్న కాలనీ ఏర్పాటు చేయడం ఇష్టం లేక స్థానికులు కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఆ భూమి ప్రభుత్వానిదని స్థానిక రెవెన్యూ అధికారులకు అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చింది. తర్వాత ఆ భూమిలో ఉపాధి హామీ పథకం నిధులతో గ్రావెల్ రోడ్డు వేసి జగనన్న కాలనీకి కేటాయించిన భూమికి ఇరువైపులా సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడ భూమిని ఆక్రమించుకునేందుకు పెదపూడి నూకరాజు ప్రయత్నిస్తున్నాడు. హైకోర్టు ఆదేశాలు ఉన్నా పొక్లెయిన్‌తో పనులు చేసి ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్నాడు. రెవెన్యూ అధికారులు స్పందించి భూమి ఆక్రమణ కాకుండా చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని సర్పంచ్, ఎంపీటీసీ తెలిపారు.

ప్రైవేటు స్కూల్‌ను ముట్టడించిన ఏఐఎస్ఎఫ్

నర్సీపట్నం: నిబంధనలను అతిక్రమించి అధిక ఫీజులు వసూలు చేసి, పుస్తకాలు విక్రయించడాన్ని నిరసిస్తూ మంగళవారం ఓ ప్రైవేటు స్కూల్‌ను ఏఐఎస్ఎఫ్ నాయకులు ముట్టడించారు. పుస్తకాలను బయటకు తీసుకొచ్చి ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎంఈవో నాగేంద్ర అక్కడకు చేరుకుని పుస్తకాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి తక్షణమే పుస్తకాలు, యూనిఫాం విక్రయించడాన్ని అరికట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ధర్నాలో జిల్లా నాయకులు బాబ్జి, ఫణీంద్ర కుమార్, రాధాకృష్ణ, జగదీష్, రవి, తాతాజీ, సింహాద్రి పాల్గొన్నారు.

30 సిమెంట్ బస్తాల చోరీ

అనకాపల్లి: మండలంలోని బీఆర్టీ కాలనీలో జగనన్న కాలనీ కోసం షెడ్డుల్లో భద్రపరిచిన 30 సిమెంట్ బస్తాలు చోరీకి గురైనట్లు పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. దీనిపై సైట్ ఇంజినీర్ అంజిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపారు.